www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 1 డిసెంబర్ 2023
5
అన్నమయ్య



జాబ్‌మేళాలో 12 మందికి ఉద్యోగాలు


ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు

ప్రజాశక్తి-పీలేరు: ఎంజెఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 12 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని "టాప్ అకాడమీ" సంస్థ హెచ్ఆర్‌లు నవీన్, జీవన్ తెలి పారు. ఎంజెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ఈ జాబ్ మేళాలో రాత పరీక్షకు 149 విద్యార్థులు హాజరు కాగా వారిలో 36 మంది అర్హత సాధించారు. గ్రూప్ డిస్కషన్, హెచ్ఆర్ ఇంటర్వ్యూల్లో 12 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.3.20 లక్షల వేతనం అందుతుందని చెప్పారు. జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కళాశాల చైర్మన్ అవినాష్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారులు రవి, సురేష్ పాల్గొన్నారు.

8 నుంచి అంగన్వాడీల సమ్మె

- సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు నాయకులు


రాయచోటి: మాట్లాడుతున్న అంగన్వాడీ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అంగన్వాడీ దీర్ఘకాల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8వ తేదీ నుంచి మెరుపు సమ్మెను చేపట్టనున్నామని అంగన్వాడీ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీలక్ష్మి, రాజేశ్వరి, అంగన్వాడీ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా కో-కన్వీనర్ సరోజ, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు మస్తాన్‌వలి పేర్కొన్నారు. గురువారం సిఐటియు జిల్లా కార్యాలయంలో మూడు సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాతాశిశు మరణాల రేటు అరికట్టడానికి ఏర్పాటు చేసిన ఐసిడిఎస్‌కు బడ్జెట్ కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. ప్రయివేట్ పరం చేయడానికి నూతన విద్యా విధానం తీసుకొచ్చారని తెలిపారు. వర్కర్లు గట్టి పోరాటాలతో తిప్పికొట్టాలని పేర్కొన్నారు. ఇప్పటికే లక్షల సంఖ్యలో రక్తహీనత, పౌష్టికాహార లోపంతో బాధపడేవారున్నారని చెప్పారు. కొత్త సెంటర్లు ఏర్పాటు చేయకుండా కార్పొరేట్ సేవలో పాలక, ప్రతిపక్షాలు మునిగితేలుతున్నాయని విమర్శించారు. కోశాధికారి బంగారుపాప, వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ తమిళనాడు, కేరళ, తెలంగాణ, కర్నాటక, హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో ధరలకనుగుణంగా కనీసవేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ అమలు చేస్తున్నా ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయలేదని పేర్కొన్నారు. సెంటర్ నిర్వహణకు అంగన్వాడీలు అప్పులు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం గుర్తించి పెండింగ్ బిల్లులు ఒక్కరూ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి జిల్లా కో-కన్వీనర్ సరోజ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో అంగన్వాడీల ప్రతి నెల జీతం వస్తుందన్న విశ్వాసం లేదన్నారు. సెంటర్ల అద్దెలు ఇవ్వలేకపోతున్నారని ప్రభుత్వం సొంత భవనాలు నిర్మించాలన్నారు. ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు మస్తాన్ వలి మాట్లాడుతూ ఐక్య ఉద్యమాలతో అంగన్వాడీల సమస్యల సాధనకు ప్రతి ఒక్కరూ నడుము బిగించాలని పిలుపునిచ్చారు. సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు, మేధావులు, ప్రజా సంఘాల మద్దతు కోరుతున్నామన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, నాయకులు ఓబులమ్మ, భాజాబీ, గౌరి, సిద్ధమ్మ, సుకుమారి, అమ్మాజీ, భువనేశ్వరి, కుమారి, ఎఐటియుసి నాయకులు స్వర్ణ, పద్మావతి, సుజాత పాల్గొన్నారు. **చిట్వేలి:** అంగన్వాడీల సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ఎదురి సుజాత అన్నారు. స్థానిక సిడిపిఒ రాజేశ్వరికి కలిసి సమ్మె నోటీసు అందించారు. కార్యక్రమంలో నాయకులు దేవి, సుబ్బరత్న, పి.లక్ష్మి కుమారి, శాంతమ్మ, మాధవి పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక పెద్దదర్గా

- సిఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి
- ప్రభుత్వ లాంఛనాలతో పూలచాదర్ సమర్పణ


పూలచాదర్ తీసుకెళుతున్న సిఎం జగన్


పెద్దదర్గాలో ప్రార్థనలు చేస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

మత సామరస్యానికి ప్రతీకగా, మహిమాన్విత సూఫీగా వెలుగొందుతున్న అమీన్‌పీర్ దర్గాను సందర్శించడంతో తన జన్మ చరితార్థమైందని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. గురువారం కడప అమీన్‌పీర్ (పెద్దదర్గా) దర్గాను సందర్శించి, ప్రభుత్వ లాంఛనాలతో పూలచాదర్ సమర్పించారు. ముందుగా ఆయనకు దర్గా ప్రతినిధులు దర్గా సంప్రదాయ లాంఛనాలతో ఘనంగా స్వాగతం పలికారు. పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేని, దర్గా కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ముఖ్యమంత్రికి తలపాగా (పేటా) అలంకరణ చేసి, మెడలోషేలా, ఇలాటి ధరింపజేశారు. అమీన్‌పీర్ దర్గా గ్రంథాలయానికి చేరుకున్న ముఖ్యమంత్రికి దర్గా విశిష్టత, ప్రాశస్త్యాన్ని, చారిత్రక వైభవాన్ని పీఠాధిపతులు వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ అమీన్‌పీర్ దర్గాను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆధారిస్తున్న జిల్లా ప్రజలు ఎంతో అదృష్టవంతులన్నారు. అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు అందివ్వగలుగుతున్నామన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పటిష్టంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ ఆధ్వర్యంలో దర్గా ప్రాంగణమంతా గట్టి పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూల సురేష్, ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, కలెక్టర్ వి.విజయ్ రామరాజు, జెసి గణేష్ కుమార్, నగర పాలక కమిషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్, దర్గా మేనేజర్ ఎస్ఎండీ అలీఖాన్, ముజావర్ అమీర్, దర్గా కో-ఆర్డినేటర్ కుతుబుద్దీన్, హజ్ హౌస్ చైర్మన్ గౌసుల్లాజం, నాయకులు అహమ్మద్ బాషా, షేక్ ఉమెర్, సయ్యద్ జైద్, డాక్టర్ సోహేల్, అఫ్జల్ ఖాన్, స్థానిక, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రసాభాసగా కౌన్సిల్ సమావేశం

- కౌన్సిలర్ల మధ్య విభేదాలతో వెళ్లిపోయిన చైర్‌పర్సన్


చైర్‌పర్సన్ పోడియం వద్ద నిరసన తెలుపుతున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి-మదనపల్లి

మదనపల్లె పురపాలక సంఘం సమావేశం అధికార పార్టీకి చెందిన కౌన్సిల్ సభ్యులు వాగ్వావాలతో రసాభాసగా మారింది. గురువారం కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గత నెల 31వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశంలో మెజార్టీ కౌన్సిలర్లు ఆమోదం తెలిపిన వాటిని తమ పార్టీ చెందిన ఐదుగురు కౌన్సిలర్లు డీసెంట్ తెలపడంపై ఆ అంశాలను తిరిగి ఈ కౌన్సిల్‌లో చేర్చడం సరికాదని దీనిపై వివరణ ఇవ్వాలని చైర్పర్సన్, కమిషనర్‌ను వైస్ చైర్మన్ జింక వెంకటాచలపతి వివరణ కోరారు. ఐదుగురు సభ్యులు డీసెంట్ తెలపడంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆ అంశాలను తిరిగి అజెండాలో చేర్చామని చైర్‌పర్సన్ తెలిపారు. చలపతి, కౌన్సిలర్లతో చైర్ పర్సన్ పోడియం వద్దకు వెళ్లి మెజార్టీ కౌన్సిలర్లకు అవమానం చేస్తున్నారన్నారు. మున్సిపల్ నిబంధన ప్రకారం మినిట్స్‌లో రాసిన తర్వాత అభ్యంతరాలు తెలవడం ఏంటని ప్రశ్నించారు. చైర్‌పర్సన్ ఆ ఐదుగురు సభ్యులు కూడా కౌన్సిల్లోని సభ్యులు కదా అని ఆమె అనడంతో రసాభాసగా మారింది. అజెండాలోని అంశాలపై చర్చ ఆగిపోగా మినిట్స్‌ను కౌన్సిల్ హాల్‌లోనే చైర్పపర్సన్ అనంతరం కౌన్సిల్ సభ్యులు అందరూ కూర్చుంటే రాసి వినిపిస్తానని తెలిపారు. తమ పార్టీ కౌన్సిలర్లే చైర్‌పర్సన్‌గా ఉన్నా తనపై ఇలా ప్రవర్తించడం సరికాదని ఆమె తెల్పడంతో ఇరువర్గాల మధ్య కొంతసేపు వాగ్వాదం జరిగింది. అనంతరం కౌన్సిల్ సభ్యులందరూ చైర్‌పర్సన్ మినిట్స్ రాయాలని పట్టు పట్టడంతో ఆమె సమావేశం మధ్యలోనే లేచి తన ఛాంబర్‌లోకి వెళ్లి రాస్తానని చెప్పి వెళ్లిపోయారు. అనంతరం ఆమె ఛాంబర్‌లోకి తిరిగి వైస్ చైర్మన్, కౌన్సిలర్లు అందరూ వెళ్లి మినిట్స్ రాయాలని పట్టుబడ్డారు. అక్కడ నుండి కూడా ఆమె వెళ్లి పోయారు. గత నెల కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్ జింక వెంకటాచలపతితో సహా ఐదుగురు సభ్యులు మినహా కౌన్సిల్ సమావేశం నుండి వినితిగారు. కౌన్సిల్ సమావేశం నుంచి చైర్‌పర్సన్ మధ్యలోనే వెళ్లిపోవడంతో సమావేశాన్ని అర్థాంతరంగా ముగించారు. గత నెలలో జరిగిన అంశంపై ఎంపీ వద్ద పంచాయితీ జరిగిందని, అందుకు ఒకే పార్టీకి చెందినవారు ఇలా వర్గాలుగా విడిపోవడం సరికాదని ఆయన చెప్పారని అందువలన అందరూ సహకరించాలని ఆమె కోరారు. ఏది ఏమైనా స్వపక్షంలోనే విపక్షం లాగా వ్యవహరించడం గ్రూపు రాజకీయాలకు తావిచ్చినట్లు అవుతుందని పలువురు చర్చించుకున్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటర్ల జాబితా సంతృప్తికరం

- జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు మురళీధర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ముసాయిదా ఓటర్ల జాబితా సంతృప్తికరమని అన్నమయ్య జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ముసాయిదా ఓటర్ల జాబితా-2024 సంబంధించి అన్నమయ్య జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు కలెక్టర్ గిరీషకలిసి ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీష జిల్లాలో చేపడుతున్న ముసాయిదా ఓటర్ల జాబితా - 2024 గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలకుడికి వివరించారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాలు, మండలాలు, 2024 కు జనాభా అంచనా, తదితర అంశాలను వివరించారు. జిల్లాలో 2024కు అంచనా జనాభా 19,77,882 మంది ఉంటారని, జిల్లాలో నవంబర్ 29 నాటికి ఈపీ రేషియో 694 ఉందని, స్త్రీ పురుష నిష్పత్తి 1032 గా ఉందని వివరించారు. జిల్లాలో 6 అసెంబ్లీ నియోజకవర్గాలకు 1607 పోలింగ్ స్టేషన్స్ ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాలకు కేటాయించిన ఇఆర్ఒల విధి విధానాలను తెలియజేశారు. జిల్లాలో 1297 మంది విధి నిర్వహణలో ఉన్న ఓటర్ల జాబితా గురించి వివరించారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాలలో కొత్తగా చేరిన ఓటర్ల జాబితా, తొలగించిన ఓటర్ల జాబితా గురించి వివరిస్తూ జిల్లాలో కొత్తగా చేరిన ఓటర్లు 62128 అని, తొలగించిన ఓటర్లు 58008 అని తెలిపారు. జిల్లాలో పోలింగ్ బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించినట్లుగా కలెక్టర్ ఆయనకు వివరించారు. జిల్లాలో నమోదైన అభ్యంతరాలను డిసెంబర్ 26 నాటికి క్లియర్ చేస్తామని, తుది జాబితాను 2024 జనవరి 5 నాటికి ప్రచురితమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లుగా ఆయనకు వివరించారు. ఇంటి నెంబరు సున్నా లేదా ఇతర జంక్ నెంబర్లు ఉన్న ఓటర్ల జాబితా, ఒక ఇంటికి పది అంతకన్నా ఎక్కువ ఓటర్లు ఉన్న జాబితా తదితర అంశాలను వివరించారు. డిఎస్ఇలు, పిఎస్ఇల జాబితా గురించి, వాటికి సంబంధించిన ఫామ్ ఏ గురించి వివరించారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలో ఒక పోలింగ్ బూత్ లెవెల్ అధికారిని సస్పెండ్ చేసినట్టుగా తెలిపారు. అలాగే 18 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల ఓటర్లను చైతన్యం చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్టుగా తెలిపారు. జిల్లాలో వివిధ నియోజకవర్గాలలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో గల పోలింగ్ స్టేషన్లను గురించి వివరిస్తూ గ్రామీణ ప్రాంతాలలో 1378 పోలింగ్ స్టేషన్లు, పట్టణ ప్రాంతాలలో 229 పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లుగా తెలిపారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ ఓటర్ల తొలగింపు జాబితా ఎప్పటికప్పుడూ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని పరిశీలకుడికి కోరారు. జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ముసాయిదా ఓటర్ల జాబితా గురించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారం వారం రాజకీయ పార్టీలతో సమావేశం అవుతున్నారని, దీనిని ఇలాగే కొనసాగించాలని సూచించారు. సార్వత్రిక ఎన్నికలకు ఓటింగ్ జరగక ముందే ఓటర్ల జాబితా సరిగా ఉందా లేదా అనేది చూసుకోవడం, పోలింగ్ స్టేషన్లు ఎలక్షన్ కమిషన్ విధి విధానాలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అన్న రెండు ముఖ్యమైన అంశాలు ఉంటాయని తెలిపారు. బిఎల్ఒలు ప్రజలతో మాట్లాడేటప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎటువంటి అవగాహన లోపం ఉండకూడదని సూచించారు. బిఎల్ఒలకు శిక్షణలో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఫార్మ్ 6కి సంబంధించి పెండింగ్ దరఖాస్తులను త్వరగా క్లియర్ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ. అధికారులు నిష్పక్షపాతంగా పనిచేస్తారని, పక్షపాతం చూపిస్తే ఎలక్షన్ కమిషన్ ఊరుకోదని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు ఓటర్ల జాబితా పరిశీలకుల సూచనలను దృష్టిలో పెట్టుకొని విధులను నిర్వర్తించాలన్నారు. ఇందులో ఏమైనా లోపాలుంటే సహించేది లేదని, కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్ఓ సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లి, రాజంపేట ఆర్డీవోలు రంగస్వామి, మురళి, రామకృష్ణారెడ్డి, ఎస్‌డిసి శ్రీలేఖ, వివిధ మండలాల తహశీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

బడుగుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : 'చింతల'

ప్రజాశక్తి-పీలేరు

బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని తలుపుల పంచాయతీ, అబ్బవరంవారిపల్లె, చెరుకువారిపల్లె, హరిజనవాడ, చల్లావాండ్లపల్లె, రాజువారిపల్లె, రెడ్డివారిపల్లెలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాలు కొనసాగాలంటే మరోసారి వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు వంద శాతం అమలు చేశారని చెప్పారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు, విమర్శలకు దిగారని పేర్కొన్నారు. వారి విమర్శలను తిప్పికొట్టాలని ప్రజలకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. గానుగచింత ప్రాజెక్ట్ నుంచి తలపుల వరకు సప్లై చానల్ పనులు చేపట్టాలని ఎమ్మెల్యేను ప్రజలు కోరారు. ఈ పనులు పూర్తైతే తలుపుల పంచాయతీ పరిధిలోని ఏడు చెరువులకు నీరు అందుతుందని తెలిపారు. వీటి ద్వారా 700 ఎకరాలకు సాగు నీరు అందుతాయని చెప్పారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ప్రతిపాదనలు చేస్తామని హామీ ఇచ్చారు. ఇరిగేషన్, ఉపాధి అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శిరీషాసందీప్‌రెడ్డి, నాయకులు మల్లికార్జునరెడ్డి, చక్రపాణిరెడ్డి, మస్తాన్, కేశవరెడ్డి, అమరనాథరెడ్డి, చంద్రకుమార్రెడ్డి, గోపి, సుధీర్‌రెడ్డి, వెంకటరమణనాయుడు, అమరనాథనాయుడు ఆంజినేయులు నాయుడు, శేఖర్, తిమ్మయ్య పాల్గొన్నారు.

సచివాలయానికి దారి ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-పీలేరు: గ్రామ సచివాలయ భవన నిర్మాణాన్ని అడ్డుకుంటున్న టిడిపి కార్య కర్తపై కలెక్టరుకు ఫిర్యాదు చేసినట్లు గ్యారంపల్లె సర్పంచ్ కె.రెడ్డెప్ప, కాంట్రాక్టర్ జయప్రకాష్‌రెడ్డి తెలిపారు. గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్యారంపల్లెలో సర్వే నెంబరు 215/6లో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు స్థలం కేటాయించారన్నారు. గ్రామ సచివాలయ భవన నిర్మాణం చేశామని తెలిపారు. భవన నిర్మాణం పూర్తి కావచ్చిందని, భవనం ముందు మెట్ల నిర్మాణం చేపట్టే క్రమంలో ఉండగా గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు జ్ఞానప్రకాష్ ఆ స్థలం తమదంటూ నిర్మాణం జరగకుండా అడ్డుపడుతున్నాడని తెలిపారు. ప్రభుత్వ స్థలంలోనే జ్ఞానప్రకాష్ అక్రమంగా పశువుల కొట్టం ఏర్పాటు చేశారన్నారు. గ్రామ సచివాలయానికి దారి కూడా లేకుండా అడ్డుపడుతుండడంపై గతంలో తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి ప్రజలకోసం నిర్మిస్తున్న సచివాలయానికి దారి ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్ర మంలో యల్లారెడ్డి, రమణ, కె.కిషోర్‌కుమారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి- రాయచోటి : అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం 'లెట్ కమ్యూనిటీస్ లీడ్' అన్న థీమ్‌తో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు, రాయచోటిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల బంగ్లా సర్కిల్ నుంచి ర్యాలీ నిర్వహించనున్నట్లు అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి శైలజ ఒక ప్రకటనలో తెలిపారు.ర్యాలీ అనంతరం మానవహారం, అవగాహన కార్యక్రమం ఉంటాయని పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా ప్రజలందరూ పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొని ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

'ఆదిత్య'లో న్యాక్ బృందం పరిశీలన

ప్రజాశక్తి-మదనపల్లె

స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ వారిచే న్యాక్ బృందం సభ్యులు ప్రొఫెసర్ నరేంద్ర బహదూర్ సింగ్, వైస్ ఛాన్సలర్ కాజా మొహిద్దిన్, ప్రొఫెసర్ జగదీప్ సింగ్, డాక్టర్ దత్తాత్రేయ సందర్శించారు. కళాశాలలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తదనంతరం ప్లేస్మెంట్ సెల్, యోగా సెంటర్, కెరీర్ కౌన్సిల్ సెంటర్, యాంటీ ర్యాగింగ్ సెల్, లైబ్రరీ, స్పోర్ట్స్, జిమ్ సెంటర్, కళాశాల మెస్, హాస్టల్స్ సందర్శించారు. కళాశాల తరగతి గదులను లాబరేటరీలను సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులతో సంభాషించి సంతృప్తి చెందారు. తరువాత పూర్వ విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులతో సంభాషించారు. కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి అభినందించారు. చివరగా కళాశాల అధ్యాపకులు, సిబ్బందిని కలిసి బోధనా పద్ధతులు బాగున్నాయని అభినందించారు. చివరగ కళాశాల చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ ఎన్.నాగమల్లారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సతీష్ బాబు, డాక్టర్ వివిఎన్ భాస్కర్, హెడ్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ వివిధ అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులను కలసి నాణ్యమైన విద్య అందిస్తున్నారని వసతులు చాలా బాగున్నాయని సంతృప్తి చెందారు.

రూ.25 లక్షలతో రోడ్డు పనులకు భూమిపూజ

ప్రజాశక్తి-పీలేరు

కె.వి.పల్లి మండలంలోని మారేళ్ల నుంచి మంచాలమందకు రూ.25 లక్షలతో చేపట్టిన 5.5 కిలోమీటర్లు రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. గురువారం మారేళ్లలో పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహకారంతో రోడ్డుకు నిధులు కేటాయించారని తెలిపారు. ఈ రోడ్డు పూర్తయితే పలు గ్రామాలకు, మండల కేంద్రానికి సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పరుశురాం, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, వాసయ్య పాల్గొన్నారు.

కనకదాస కీర్తనలు ఆదర్శం

ప్రజాశక్తి - రాయచోటి


కనకదాస చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, జెసి, అధికారులు

శ్రీకనకదాస కీర్తనలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసు కోవాలని జిల్లా ఎన్నికల అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి, కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. గురువారం శ్రీ కనకదాస జయంతి మహోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కనకదాస చిత్రపటానికి జిల్లా ఎన్నికల అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి, కలెక్టర్ గిరీష, జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అబ్జర్వర్,కలెక్టర్ గిరీష పిఎస్ మాట్లాడుతూ శ్రీ కనకదాస ఎన్నో కీర్తనలు రచించారని ఆయన కీర్తనలు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఆయన రచించిన కీర్తనలు ఇప్పటికీ ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని పాటిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ సత్యనారాయణ, కలెక్టరేట్ ఎఒ బాలకృష్ణ, బిసి వెల్ఫేర్ ఆఫీసర్ సందప్ప, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రక్తహీనత నివారణకు చర్యలు : జెసి

ప్రజాశక్తి - రాయచోటి

గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, సంబంధిత అధికారులకు చూచించారు. గురువారం వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి జిల్లా కలెక్టర్లు, జెసిలతో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కె.ఎస్ జవహర్‌రెడ్డి వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి జెసి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కొండయ్య, డిపిఒ ధనలక్ష్మి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జెసి అధికారులతో మాట్లాడుతూ రక్తహీనత లోపం ఉన్న గర్భిణుల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించి వారికి సరైన పోషకాహారం అందించి రక్తహీనత నివారణకు కృషి చేయాలన్నారు. గర్భిణులు, బాలింతలు అనీమియా బారిన పడకుండా ఉండేందుకు, క్రమం తప్పకుండా పౌష్టికాహారం ఇవ్వాలన్నారు. చిన్న పిల్లలలో బరువు తక్కువ ఉండడం, ఎదుగుదల లోపం వంటి సమస్యలకు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో నాణ్యమైన పౌష్టికాహారం అందించాలన్నారు. రక్తహీనత, పోషకాహార లోపాన్ని అధిగమించడం, అంగన్వాడీ కేంద్రాల్లో బరువు, ఎత్తు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి ఎదుగుదలకు పటిష్ట ప్రణాళిక రూపొందించి అమలు పరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికి ఉచిత ఆరోగ్య సేవలు అందించేందుకు చర్యలు చేపడుతుందని చెప్పారు. జిల్లాలోని వైద్యాధికారులందరూ ఆ దిశగా పనిచేయాలన్నారు. ఎఎన్ఎం, ఆశా వర్కర్స్ ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు చేయాలన్నారు. గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియోకు సంబంధించి 5-18 సంవత్సరాల మధ్య ఉన్న ప్రతి పిల్లవాడిని పాఠశాలలో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 10వ తరగతి, ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులను మరల తిరిగి పాఠశాలల్లో, కళాశాలలో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, వారికి అమ్మ ఒడి పథకం వస్తుందనే విషయాన్ని తెలియచేయాలని, ఒక వేళ వారు చేరకపోతే ఓపెన్ స్కూల్ లోనైనా చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్ లో చేర్పించడంతో పాటు నైపుణ్య శిక్షణ కేంద్రాలకు వారిని అనుసంధానం చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైలు మార్గాన్ని త్వరగా పూర్తి చేయాలి : పిసిసి


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

రాయచోటి ప్రాంత సమగ్ర అభివృద్ధి కోసం గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కడప, రాయచోటి, మదనపల్లి, బెంగళూరు కొత్త రైలు మార్గాన్ని మంజూరు చేసిందని, కడప నుంచి పెండ్లిమర్రి వరకు రైలు మార్గం పూర్తయిందని పిసిసి రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధులను ఇవ్వని కారణంగా పనులు నిలిచిపోయాయని, ప్రభుత్వం తన వాటాగా చెల్లించాల్సిన నిధులు వెంటనే విడుదల చేసి రైలు మార్గాన్ని త్వరగాపూర్తిచేయాలని డిమాండ్ చేశారు. డిసిసి అధ్యక్షులు షేక్ అల్లాబకష్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి బంగళా సర్కిల్ వరకు పిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు నజీర్ అహ్మద్, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ శాంతయ్య, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు కత్వాల్ మహమ్మద్ రఫీక్, రాష్ట్ర కార్యదర్శి లీలా శ్రీనివాస్, జిల్లా అన్ని నియోజకవర్గాల కన్వీనర్లు రెడ్డి సాహెబ్, సోమశేఖర్ రెడ్డి, రైల్వేకోడూరు బాధ్యులు గోసాల దేవి, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఆడిటర్ మన్సూర్ అలీఖాన్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు చెన్న కృష్ణ, జిల్లా మీడియా చైర్మెన్ నరేష్, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు మంజునాథతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వాటాగా ఇవ్వవలసిన నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులు వెంటనే రైల్వే శాఖ ప్రాజెక్టు పనులు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. లేకుంటే రాయలసీమ ప్రజలు కోపాగ్నికి వైసిపి గురికాక తప్పదని హెచ్చరించారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు దర్బార్ బాష, కోనేశేటి ప్రతాప్‌రెడ్డి, యహియాబాష, ఖాదర్ ఖాన్, మహ్మద్ రఫీ, డాక్టర్ అహ్మద్‌బాషా, రమేష్, రమణమ్మ, మహబూబ్ జాన్, మాజీ కౌన్సిలర్ మీనాకుమారి, రిజ్వానా పాల్గొన్నారు.


చెరువు కట్టపై ఉన్న వ్యర్థాలను తొలగిస్తున్న జెసిబి

పెద్దచెరువు కట్టపై పారిశుధ్య పనులు

-ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని గోరాన్‌చెరువు పంచాయతీ కుమ్మరుపల్లిలో పెద్దచెరువుకట్టపై పారిశుధ్య పనులను చేపట్టారు. చికెన్ సెంటర్ల వ్యర్థాలు, గృహ సముదాయాల నుంచి చెత్తా చెదారాన్ని చెరువుకట్టపై వేయడంతో డంపింగ్ యార్డ్‌లా తయారైంది. 'డంపింగ్ యార్డ్‌ను తలపిస్తున్న పెద్దచెరువుకట్ట' అనే శీర్షికతో గురువారం ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి సరోజమ్మ ఆధ్వర్యంలో అక్కడికి వెళ్లి చెత్తా చెదారాన్ని జెసిబిలతో తొలగింపజేశారు.. ఎంపిడిఒ శేఖర్‌నాయక్ స్పందిస్తూ చెరువుకట్టపై పారిశుధ్య పనులు చేయించి, ఈ ప్రాంతంలో వ్యర్థాలు వేసినవారికి రూ.500 జరిమానా విధించనున్నట్లు బోర్డును ఏర్పాటు చేస్తామని చెప్పారు.

వచ్చే ఎన్నికల్లో టిడిపిదే అధికారం : ఆర్‌జె

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారం చేపడుతుందని రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి ఆర్.జె వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని సామకోటవారిపల్లి పంచాయతీ, ఎంజి కోట వద్ద నూతనంగా నిర్మించిన వీరభద్ర స్వామి ఆలయంలో విగ్రహప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన అందించడానికి వచ్చే ఎన్నికల్లో టిడిపి తప్పక విజయం సాధిస్తుందన్నారు. వైసిపి పాలనపై ఇప్పటికే ప్రజలు విసుగు చెందారని అన్నారు. నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి వచ్చిన మద్దతే పార్టీ విజయానికి నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పుర్రా వెంకటరమణ, నాయకులు రాటకొండ మధుబాబు, పూల మురళి, ఎల్లప్ప, ఎల్.వెంకటరమణ, నారాయణ, కృష్ణ, వెంకటరమణ, ప్రతాప్, మార్పూరి మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు రాయచోటిలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-వీరబల్లి

జిల్లా కేంద్రం రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 2న శనివారం జరిగే మెగా జాబ్ మేళాను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నిరుద్యోగ యువతకు ఎంపిపి గాలివీటి రాజేంద్రనాథరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 8వ తరగతి నుంచి పీజీ వరకు చదివిన వారు ఎవరైనా ఈ జాబ్ మేళాలో పాల్గొని వారి అర్హతలకు తగ్గ ఉద్యోగాలు పొందవచ్చని చెప్పారు. నూరుకు పైగా వివిధ కంపెనీలు ఉద్యోగాలు ఇవ్వడానికి పాల్గొననున్నట్లు వారు తెలిపారు. రీజినల్ జాబ్ మేళాలో హాజరయ్యే నిరుద్యోగ యువత విద్యార్హతలు పదవ తరగతి,ఇంటర్, ఐ.టి.ఐ, డిప్లొమా, బి.ఫార్మసీ, నర్సింగ్ డిగ్రీ , బి.టెక్, పీజీ చదివిన వారు18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వయసు కలిగిన అభ్య ర్థులు అర్హులని అన్నారు. జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10వేల నుంచి 50 వేల వరకు జీతం ఉంటుం దని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్‌కార్డ్, రెండు ఫోటోలతో హాజరుకావాలని సూచించారు.

విద్యుత్ కార్మికుల నిర్బంధం

-పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

ప్రజాశక్తి-నందలూరు


గేటుకు తాళం వేయడంతో లోపలే ఉన్న విద్యుత్ కార్మికులు

నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ, ఆరవపల్లె ఆర్ఎస్ రోడ్డులోని పాత స్టేట్ బ్యాంకు ప్రహరీలో విద్యుత్ కార్మికులను ఇంటి యజమాని బంధించిన సంఘటన గురువారం చేసుకుంది. పాత స్టేట్ బ్యాంక్ సమీపంలో ఏర్పాటుచేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ కాలిపోవడంతో నూతన ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు కొరకు విద్యుత్ కార్మికులు ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ఉన్న భవన ప్రహరీలోకి వాహనంతో వెళ్లి పనులు చేస్తూ ఉండగా, ఆ భవన యజమాని ఎవరిని అడిగి లోపలికి వచ్చారని ఆగ్రహం వ్యక్తం చేసి, విద్యుత్ అధికారులను, వాహనాన్ని లోపల పెట్టి గేటుకు బీగం వేసి నిర్బంధించాడు. ఈ విషయాన్ని విద్యుత్ అధికా రులు పోలీ సులకు ఫిర్యాదు చేయడంతో ఇంటి యజమానిని పిలిపించి మందలించడంతో గొడవ సద్దు మణిగింది.

టిడిపితోనే 'భవిష్యత్తుకు గ్యారంటీ'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

టిడిపితోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ ఉంటుందని ఆ పార్టీ ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. చంద్రబాబు ఆదేశాల మేరకు పటాన్ కాలేజీ వద్ద జంగంపేట వీధిలో గురువారం ఆయన ఇంటింటికి తిరిగి ప్రజల కష్టాలను తెలుసుకుంటూ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను ముఖ్యంగా మహిళల ఆర్థిక స్వావలంబనకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మహానాడులో ప్రకటించిన మేనిఫెస్టో చేయూత నిస్తుందన్నారు. రాష్ట్రంలో యువతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన అన్యాయాలపై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన వస్తోందన్నారు. కార్యక్రమంలో ఇట్టే చౌడమ్మ, ఇట్టే సునీల్‌కుమార్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బండి విజయభాస్కర్‌రెడ్డి, రాజుపాలెం మండల కన్వీనర్ ధనిరెడ్డి విశ్వనాథరెడ్డి, వెలవలి పద్మనాభరెడ్డి, పొట్టిపాటి గంగాధర్, కృష్ణారెడ్డి, మోత్కూరు వెంకటసుబ్బయ్య, నరసింహులు, మాజీ కౌన్సిలర్ పాణ్యం సుబ్బరాయుడు, అంపావతిన సుబ్బరాయుడు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సుంకర వేణుగోపాల్, మెరువా మూర్తి, పెన్నానగర్ మజీద్, 34 వార్డ్ రాఘవ, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.18 లక్షలు

ప్రజాశక్తి - చక్రాయపేట

జిల్లాలో ప్రసిద్ధి చెందిన గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో భక్తులు హుండీలో వేసిన కానుకుల ద్వారా హుండీల లెక్కింపులో 71 రోజులకు గానూ రూ.18,64,414 నగదు, 02 గ్రాములు బంగారం, ఒక కిలో 600 గ్రాములు వెండి వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, చైర్మన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్, ఏపీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ సాయిఅన్వేష్, ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు కేసరిస్వామి, రాజాస్వామి, కార్యాలయ సిబ్బంది, కళ్యాణ కట్ట క్షురకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ రేషన్ : తహశీల్దార్

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి ఇంటి వద్దకు ఎండియు వాహనం ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నట్లు తహశీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి చెప్పారు. రేషన్ పంపిణీ చేసే సమయంలో వాలంటీర్లు ఆయా ప్రాంతాల్లో ఉండి ఎండియు వాహనం ద్వారా ప్రతి ఇంటికి రేషన్ బియ్యం ఇప్పిస్తారన్నారు. కేటాయించిన స్థలంలో వాలంటీర్లు ఎండియు వాహనాలు పెట్టి రేషన్‌కు సంబంధించి నిత్యావసర సరుకులను తూకం వేసి ఇస్తారని చెప్పారు. ఆ మేరకు వాలంటీర్లు, ఎండియు ఆపరేటర్లు పనిచేయాలని ఆయన సూచించారు.


బ్యాంకు ఖాతా నుంచి నగదు మాయం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని తవ్వారిపల్లెకు చెందిన ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యులు తవ్వా వెంకటయ్య బ్యాంకు ఖాతా నుంచి దాదాపు రూ.58 వేలు మాయమైనట్లు గురువారం పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేశారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తం గా ఉండాలని పోలీసులు సూచించారు.

అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి-గాలివీడు



మండల కేంద్రంగా ఉన్న గాలివీడు పట్టణం రోజురోజుకు అభివృద్ధి చెందుతుంది. జనాభా పెరుగుతుండటంతో ఊరు విస్తరించడంతో పాటు కొత్త వీధులు కూడా ఏర్పాటవుతున్నాయి. జనాభాకు సరిపడ అంగ న్వాడీ కేంద్రాలు లేకపోవడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బం దులు పడుతున్నారు. రెండు కిలోమీటర్ల వరకు అంగన్వాడీ కేంద్రం లేపోవ డంతో ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను పొందలేకపోతున్నారు. పట్టణ సమీపంలోని చిలకలూరిపేటలో 300 గృహాలు, నాయన వారిపల్లెలో వంద గృహాలు, తొట్టిగాడిపల్లిలో 50 కుటుంబాలు, అరవీటివాళ్ళపల్లెలో 200 కుటుంబాలకు పైగా నివాసముంటున్నారు. ఈ నాలుగు గ్రామాలకు రెండు కిలోమీటర్ల దూరంలో ఒక్క అంగన్వాడీ కేంద్రం మాత్రమే ఉంది. లేకుంటే మండల పరిధిలోని పక్కిరారెడ్డిగారిపల్లి, శెట్టివారిపల్లి అంగన్వాడీ వెళ్లాల్సి వస్తోందని స్థానిక ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఆరెండు కేంద్రాల్లో కూడా పిల్లలు, గర్భిణులు, బాలింతల సంఖ్య ఎక్కువగా ఉండటంతో అవ స్థలు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిపెట్టి అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చిన్న పిల్లలతో ఇబ్బంది పడుతున్నాం

అంగన్వాడీ కేంద్రం లేక చిన్నపిల్లలు ఇబ్బంది పడుతున్నాం. కిలోమీటరు పరిధిలో కూడా అంగన్వాడీ కేంద్రం లేదు. సమీపంలోని బలిజ పల్లి గ్రామానికి వెళ్లాలంటే ఒడ్డు అడ్డంగా ఉండటంతో చిన్నపిల్లలలో వెళ్లాలంటే మహిళలు బయ పడుతున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అనువుగా ఈగ్రామాల పరిధిలోనే అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలి.

- అరవీటి రవీంద్రారెడ్డి, వార్డు మెంబర్, గాలివీడు

గర్భిణులు, బాలింతలకు అవస్థలు



నాయనవారిపల్లెలో గర్భి ణులు, మహిళలు ప్రభుత్వం అందించే పౌష్టికా హారానికి దూరమ వుతు న్నారు. అంగ న్వాడీ కేంద్రానికి వెళ్ళాలంటే రెండు కిలోమీటర్లు నడవాల్సి రావ డంతో అవస్థలు పడుతు న్నారు. తమ గ్రామంలోనే ఏర్పాటు చేస్తే గర్భిణులు, బాలిం తలకు, చిన్నారులకు అనువుగా ఉంటుంది. మినీ అంగన్వాడీ కేంద్రమైనా ఏర్పాటు చేయాలి.

- గంగాధర్‌నాయుడు, గాలివీడు

అంగన్వాడీ కేంద్రం ఏర్పాటుకు కృషి



అరవీటివారిపల్లి, తొట్టిగారిపల్లి, నాయనవారిపల్లి, చిలుకలూరిపేట గ్రామస్తుల వినతిని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయడానికి కృషి చేస్తాం. ఐసిడిఎస్ పీడీతో సంప్రదించి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సహకారంతో మినీ అంగన్వాడీ సెంటర్ నైనా ఏర్పాటు చేయడానికి కృషి చేసాం.

- మిట్టపల్లి లక్ష్మీదేవి, సర్పంచ్, గాలివీడు

నవయుగ వైతాళికుడు 'గురజాడ'


గురజాడ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-నందలూరు

సంఘసంస్కర్త, నవయుగ వైతాళికుడు, మహాకవి గురజాడ వెంకటఅప్పారావు రచించిన "దేశమును ప్రేమించుమన్నా.. మంచి అన్నది పెంచుమన్నా అనే దేశభక్తి గేయాన్ని అన్ని దేశాలు తమ దేశ గేయంగా పాడుకునేలా చేశాడని వక్తలు కొనియాడారు. గురజాడ 108వ వర్ధంతి కార్యక్రమాన్ని మండలం లోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సాయంత్రం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలలితకుమారి ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయులు గంగనపల్లి వెంకట రమణ, గీత, రమణమ్మలు ఈ కార్యక్రమం నిర్వహించారు. నాటి సమాజంలోని కన్యాశుల్కాన్ని, బాల్య వివాహాలను నిరసిస్తూ రచనలు చేసి ప్రజలలో చైతన్యం తీసుకొచ్చేందుకు అవిరళమైన కృషి చేసిన గురజాడ వెంకట అప్పారావు మనకు చిరస్మరణీయుడని కొనియాడారు.ఆయనను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. నవయుగ వైతాళికుడిగా ప్రజలగుండెల్లో నిలిచిపోయారని అన్నారు. ఆయన రచనలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. నాటి సమాజంలో రుగ్మతలను రూపుమాపేందుకు ఆయన రచనలు ఎంతగానో దోహదపడ్డాయని అన్నారు. సంఘసంస్కర్తగా సమాజంలో మార్పు కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. నేటి రచయితలకు, కవులకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకొని సమాజంలో గొప్ప పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డాక్టర్ నాగేంద్రప్రసాద్, శిల్పి ఆనందచారి, లక్ష్మీనారాయణ, వెంకటసుబ్బయ్య, విజయ కుమారి, మస్తాన్, జివి రమణ, జ్యోతి ప్రియ, ఆర్‌వి రమణమ్మ, షాకీర్‌హుస్సేన్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో నెరవేరిన కల

అయ్యవారిపల్లెకు పూర్తయిన తారురోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీ పరిధిలోని అయ్యవారిపల్లె వాసుల దశాబ్దాల కళ ఎట్టకేలకు నెరవేరింది. పట్టణ సమీపంలో గల అయ్యవారి పల్లికి చాలా సంవత్సరాలుగా రోడ్డు సౌకర్యం లేక ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని స్థానిక వైసిపి నాయకులు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్‌అహ్మద్‌ల దృష్టికి తీసుకెళ్లారు. సత్వరమే ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు పాగొండ ఖలీల్‌అహ్మద్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు అయ్యవా రిపల్లికు తారురోడ్డును నిర్మించారు. అయ్యవారిపల్లి వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎంతో మంది ఎమ్మెల్యేలు మారిన తమ సమస్యను పట్టించుకోలేదని, ప్రస్తుత ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డికి తమ సమస్య తెలిసిన వెంటనే తారు రోడ్డు వేయించారని హర్షం వ్యక్తం చేశారు. తమ గ్రామానికి తారురోడ్డు వేసి దశాబ్దాల కల నేర వేర్చిన ఎమ్మెల్యేకు, ఖలీల్ అహ్మద్, స్థానిక వైసిపి నాయకులు, అధికా రులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ కన్వీనర్ సిఆర్ చిన్ని కృష్ణ, వైసిపి మండల కన్వీనర్ ప్రదీప్‌రెడ్డి, భీమగాని ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి అయూబ్‌బాషా, కో-ఆప్షన్ మెంబర్ నాసర్, నరసింహ నాయుడు,షేక్ ముజీర్, జిఎం చాంద్‌బాషా, జనార్ధన్ పాల్గొన్నారు.


నూతనంగా వేసిన తారురోడ్డు

కార్పొరేట్‌కు ధీటుగా వంద పడకల ఆస్పత్రి


ఆస్పత్రిలో పర్యటిస్తున్న ఎపిఎంఎస్ఐడిసి వైస్ చైర్మన్, ఎమ్మెల్యే, కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

కార్పొరేట్‌కు ధీటుగా ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా రాయచోటి వందపడకల ఆస్పత్రి అభివృద్ధిని తీర్చిదిద్దుతామని ఎపిఎంఎస్ఐడిసి ఎండి, వైస్ చైర్మన్ మురళీధర్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, కలెక్టర్ గిరీషలు పేర్కొన్నారు. గురువారం రాయచోటి వందపడకల ఆస్పత్రి భవనాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, కలెక్టర్ గిరీషలు పరిశీలించారు. ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ టి.డేవిడ్‌సుకుమార్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ బేపారి మహమ్మద్ ఖాన్‌లు వారికి స్వాగతం పలికారు. ఆస్పత్రి నిర్మాణంలోని ప్రతి గదినీ వారు పరిశీలించారు. ఆర్చి నిర్మాణాలను, ఆక్సిజన్ ప్లాంట్‌ను పరిశీలించారు. డయాలసిస్ కేంద్రంలో ఎనిమిది బెడ్లు ఉన్నాయని, మూడు షిఫ్ట్‌ల ద్వారా రోజుకు 24 మందికి డయాలసిస్ చేయడం జరుగుతోందని అన్నారు. ఆధునీకరణ పూర్తి అయ్యేంత వరకు ఆస్పత్రి వార్డులలోనే తాత్కాలికంగా నిర్వహించుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులను శ్రీకాంత్‌రెడ్డి కోరారు. రహదారి ప్రక్కనున్న విద్యుత్ లైన్ మార్చాలని అధికారులను ఆదేశించారు. మురళీ ధర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నాబార్డ్ నిధులతో168 ఏరియా ఆస్పత్రులు, సిహెచ్‌సిలు, జిల్లా ఆస్పత్రులు, స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణాలను చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు డిసెంబర్‌లోగా నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే, కలెక్టర్‌లు మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రులలో రోగులకు మెరుగైన వసతుల కల్పనే ధ్యేయంగా సిఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వాసుపత్రుల రూపురేఖలు మారాయన్నారు. గ్రామాలలో విలేజ్ హెల్త్‌క్లినిక్, పట్టణాలలో పట్టణ ఆరోగ్య కేంద్రాలను నిర్మించి ప్రజల చెంతకే వైద్యం అందేలా ప్రభు త్వం కృషి చేస్తోందన్నారు. రాయచోటి వందపడకల ఆసుపత్రి భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి త్వరలో జాతికి అంకితం చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, ఎపిఎంఎస్ఐడిసి ఎస్ఇ కృష్ణారెడ్డి, ఇఇ కెజెఎస్ చంద్రారెడ్డి, డిఇ రాజగోపాల్ రెడ్డి, వైద్యాధికారులు డా బండారు కిరణ్ కుమార్, డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, కొత్తపల్లె ఇంతియాజ్, విక్కీ దేవేంద్ర, జావీద్,అమీర్ పాల్గొన్నారు.

భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

- నిరసనలో ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

వైసిపి ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన భూహక్కుల చట్టం-23తో ప్రజల ఆస్తులకు భద్రత ఉండదని, చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని రాయచోటిలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురు వారం నిరసన నిర్వహించారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.ఈశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ హక్కుల చట్టం-23 అమలులోకి వస్తే ఇప్పటివరకు భూములకు ఉన్న 30 రకాల రికార్డులన్నీ రద్దయిపోతాయని వాటి స్థానంలో ఒకే ఒక టైటిల్ రిజిస్ట ర్‌ను రెవెన్యూ అధికారులు తయారు చేస్తారని దీనినే ఫైనల్ హక్కుగా ప్రభుత్వం నిర్ధారిస్తుందని అన్నారు. ఈ పద్ధతి వల్ల పలుకుబడి కలిగిన వారి చేతుల్లోకి అధికార వ్యవస్థ వెళ్లిపోతుందని ఫలితంగా బలహీనుల భూములన్నీ కూడా ఉన్నత వర్గాల చేతుల్లోనికి వెళ్లిపోతాయని ఆయన అన్నారు. టైటిల్ రిజిస్టర్‌లో పేరును అక్రమంగా ఎక్కించినప్పటికీ రెవెన్యూ వారు చేసే తప్పులను సివిల్ కోర్టులో న్యాయమూర్తులు ప్రశ్నించే అధికారం ఉండదని అన్నారు. భూమి టైటిల్‌ను నిర్ధారించే సివిల్ కేసులు కోర్టులో దాఖలు చేయడానికి అవకాశం ఉండదని ఈ చట్టంలోని సెక్షన్ 38 తెలుపు తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం కనుసన్నల్లో జిల్లాకు ఒకటి మాత్రమే నడిచే ట్రిబ్యునల్ మాత్రమే ఆస్తుల హక్కును నిర్ణయిస్తాయని అక్కడ న్యాయం జరగకపోతే హైకోర్టుకు వెళ్లాల్సి వస్తుందని ఇదంతా పేద మధ్య తరగతి ప్రజలకు సాధ్యం కానీ పని అని తెలిపారు. వారి హక్కులను హరించే విధంగా ఉందని ఆయన విమర్శించారు. ప్రజాస్వామ్యానికి మూల స్తంభమైన న్యాయవ్యవస్థ నిబద్ధతనే అవమానపరుస్తూ రెవెన్యూ అధి కారులని న్యాయమూర్తులుగా గుర్తిస్తున్న ఈ భూ హక్కుల చట్టం సమా జానికే పెద్ద ప్రమాదమని వారన్నారు. రెవెన్యూ అధికారులు చేసిన పాపాలతోనే దేశంలో ఇప్పటికే నాలుగు కోట్ల సివిల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని మళ్లీ వారి వద్దకే వెళ్లి ప్రజలు న్యాయాన్ని ఎలా పొందగలుగు తారని ఆయన విమర్శించారు. ఎంఆర్‌పిఎస్ నాయకులు రామాంజ నేయులు, భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతయ్య మాట్లాడుతూ దళితులకు సంబంధించిన డికెటి, ఇనాం లాంటి భూములు లాక్కొని వారికి అన్యాయం చేస్తున్న ప్రభుత్వం ఈ చట్టం రాకతో వారికి మరింత అన్యాయం జరిగే పరిస్థితులు ఉన్నాయని వాపోయారు. దళితుల భూములన్నీ పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని, ఈ చట్టం రద్ద య్యేవరకు న్యాయవాదులతో కలిసి ఉద్యమిస్తామని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గం నాయకుడు విశ్వనాథ్ నాయక్ , బంజారా సంఘం రాష్ట్ర నాయకులు శంకర్ నాయక్ ఎపి వడ్డెర విద్యావంతుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతి శంకర్, ఉపాధ్యక్షులు చెల్లా రెడ్డయ్య, జువెలరీ షాప్ యజమానుల సంఘం అక్బర్ అలీ, రజక సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాజా, కక్షిదారులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు


సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపిపి శ్రీదేవిరవికుమార్

జగన్ పాలనలో ప్రజలు సుభిక్షం : ఎంపిపి

ప్రజాశక్తి-కలకడ

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలందరూ సుభిక్షంగా ఉన్నారని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ కొనియాడారు. గురువారం మండలంలోని కోట గుడిబండ పంచాయతీలో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పథకాలను అమలుపరిచే ప్రజలకు అన్ని విధాల సహకరించి గొప్ప నాయకుడిగా పేరు తెచ్చుకున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డేనని కొనియాడారు. శుక్రవారం ఏనుగొండపాలెం పంచాయతీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ కమలాకర్ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి, ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లి: తంబళ్లపల్లి గ్రామ సచివాలయంలో వైస్ ఎంపిపి కరీం, మండల ప్రత్యేక ఆహ్వానితులు చిన్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు జమాల్‌బాషాల ఆధ్వర్యంలో వై ఎపినీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పతాకాన్ని, డిజిటల్‌బోర్డును ఆవిష్కరించారు. స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మల్లయ్యకొండ అభివృద్ధి, నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశారన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలతో పాటు ప్రతిపల్లెకు రోడ్లు, మౌలిక వసతులు కల్పించారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సురేంద్రనాథ్, వైసిపి మండల కన్వీనర్ చౌడేశ్వర్, మండల అభివృద్ధికి ఎంటి చైర్మన్ నారాయణరెడ్డి, సింగల్ విండో చైర్మన్ భార్గవరెడ్డి, సర్పంచుల సంఘంఅధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి మైనుద్దీన్, సుధాకర్ రెడ్డి, రామ్మూర్తి పాల్గొన్నారు.


బస్టాండ్‌లో పనులను పర్యవేక్షిస్తున్న ధనుంజయ

ఆర్‌టిసి బస్టాండ్ పనులు పరిశీలన

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

లక్కిరెడ్డిపల్లి ఆర్‌టిసి బస్టాండ్ పనులను రాయచోటి డిపో మేనేజర్ ధనుంజయ గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి ఆర్‌టిసి బస్టాండ్ ఇటీవల కాలంలో రూ.41 లక్షలతో ప్రభుత్వం టెండర్లు పిలిచిందని తెలిపారు. బస్టాండ్ ఎడమవైపు ప్రహరీ, ప్లాట్ ఫామ్, కాంక్రీట్ పనులు, మరుగుదొడ్లు చేపట్టనున్నారు. త్వరలో పనులు పూర్తిచేసి జనవరిలో బస్టాండ్ ను ప్రయాణికుల సౌకర్యార్థం వాడుకులోకి తీసుకొస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌టిసి డిపో మేనేజర్ ధనుంజయ, ఫీల్డ్ సూపర్వైజర్ మునిబాబు, కాంట్రాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని కాశీనాయన వృద్ధాశ్రమంలో గురువారం అన్నదానం నిర్వహించారు. సిద్దారెడ్డిపల్లె గ్రామానికి చెందిన కొండారెడ్డిగారి శ్రీరాములరెడ్డి, స్వాతి దంపతుల కుమార్తె విద్యాశ్రీ పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు వెంకటయ్య, అన్నదాతల కుటుంబ సభ్యులు కొండారెడ్డి, ఈశ్వరమ్మ, వీరారెడ్డి, లక్ష్మీరెడ్డి, రామసుబ్బమ్మ, విక్రమ్‌రెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా ఓబుల్‌రెడ్డి

ప్రజాశక్తి - దువ్వూరు

జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా మండలంలోని పుల్లారెడ్డిపేటకు చెందిన కానాల ఓబు ల్‌రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ఇంతటి పదవి ఇచ్చినందుకు ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఎంపీ అవి నాష్‌రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే రఘు రామిరెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు ఇరగంరెడ్డి తిరు పాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకుండా చూస్తానన్నారు.

క్లాప్ డ్రైవర్లకు జీతాలు చెల్లించాలి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పని చేస్తున్న క్లాప్ డ్రైవర్లకు ఆరు నెలల నుండి వేతనాలు ఇవ్వడం లేదని, వెంటనే వారికి బకాయిలు చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, కార్యదర్శి విజయకుమార్ కోరారు. ఆ మేరకు గురువారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటింటికీ ఆటోలు వెళుతుంటాయని, ప్రతి ఇంటి నుంచి నెలకు రూ.60 వసూలు చేస్తూంటారు. కాంట్రాక్టర్‌కు నెలకు ఆటోకు రూ.62 వేలు చెల్లిస్తు న్నారన్నారు. అయినా ఆ కాంట్రాక్టరు క్లాప్ డ్రైవర్లకు 6 నెలల నుండి వేతనాలు ఇవ్వకుండా పిఎఫ్, ఇఎస్ఐ నమోదు చేయకుండా వారాంతపు సెలవులు ఇవ్వకుండా వారితో పని చేయించడం సమంజసం కాదన్నారు. విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళితే తనకు సంబంధం లేదని చెప్పడం తగదన్నారు.

రబీ పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

రబీ సీజన్‌లో సాగు చేసిన పంటను వెంటనే ఇ క్రాప్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మ్యాగీ రైతులకు సూచించారు. ప్రతి రైతు తన పొలంలో సాగు చేసిన పంటను గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలోని వ్యవసాయ సహాయకులకు తెలిపి తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు.

క్రైం కార్నర్

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఏడుగురికి జైలు శిక్ష

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని రాయచోటి ట్రాఫిక్ ఎస్ఐ మొహమ్మద్‌రఫీ అన్నారు. గురువారం డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఏడుగురిని రాయచోటి కోర్టులో హాజరు పరచగా సెకండ్ క్లాస్ జడ్జి శారద మూడు రోజులు జైలుశిక్ష విధించారు. ఎస్‌పి కృష్ణారావు ఆదేశాల మేరకు డిఎస్‌పి మహబూబ్‌బాషా రాయచోటి అర్బన్ సిఐ సుధాకర్‌రెడ్డి ఉత్తర్వుల మేరకు పట్టణంలోని వివిధ కూడలి వద్ద వాహనాలు నడుపుతున్న స్పెషల్ డ్రైవ్ జరిపి అందులో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో మత్స్యకారుడి మృతి

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు పంచాయతీలోని గుర్రాలమిట్ట చేపలకాలనీకి చెందిన బత్తిన మనోహర (22) అనే మత్స్యకారుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుండ్లచెరువు దుర్గంగుడి చెరువులో చేపలు పట్టడానికి మధ్యాహ్నం చెరువులోకి దిగి వలలు వేస్తూ వెనుకవైపు వస్తుండగా అక్కడ ఉన్న విద్యుత్‌వైర్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడని చెప్పారు. మృతుడికి తండ్రి నారాయణ, తల్లి రెడ్డమ్మ, చెల్లెలు మంజుల ఉన్నారని అన్నారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ శివకుమార్ పేర్కొన్నారు.